క్లుప్తంగా

'బాల సదనం' ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

శ్రీకాళహస్తి: స్థానిక పిచ్చాటూరు రోడ్డులోని బాల సదనంను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి ఆకస్మిక తనిఖీ చేశారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. రిజిస్టర్, స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. వసతులు బాగున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నీర్పాకోటలోని చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చెంగాళమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి, అలంకరించి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం విగ్రహాన్ని పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి, మైలు ముగ్గు తీర్పు, కలశం ఉత్సవం, శేషపాన్పు, కలశ గ్రామోత్సవం, పోతురాజు ముగ్గులను వేస్తారు. విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం అంబలి, చెంగాళమ్మ దేవత ముగ్గు, పొంగళ్లు కార్యక్రమాలు జరుగుతాయి. సోమ వారం ఉదయం ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగింపు, ఎదురు పొంగళ్లు కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

సత్యవేడు: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో స్మార్ట్ మీటర్లు వద్దు... పాత మీటర్లు ముద్దు అని ఆ పార్టీ నాయకులు కోరారు. సీపీఎం నాయకుడు ఎం రమేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై విద్యుత్ వినియోగదారులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణలో భాగంగా అదానీ కంపెనీకి స్మార్ట్ మీటర్లు బిగించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మునస్వామి, వెంకటేశులు, కృష్ణయ్య, శేఖర్, సుబ్రమణ్యం, తిరుమలై, రాము, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న పండితులు

తిరుపతి కల్చరల్: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో శ్రీవారి సేవా గ్రూప్ ఆధ్వర్యంలో రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ వైభోగ వ్రతం నిర్వహించారు. ఈ పూజల్లో 600 మహిళలు వ్రతమాచరించారు. అనంతరం నిర్వాహకులు మహిళలకు అమ్మవారి కుంకుమ, పసుపుదారం, గాజులు, ప్రసాదం పంపిణీ చేశారు. నిర్వాహకులు చంద్రమౌళి, ప్రసన్నలక్ష్మి, వసుంధర, గీతాంజలి, సరళ పాల్గొన్నారు.

బడుల కోసం ఆగని పోరాటం

- కేవీబీపురంలో 43 రోజులుగా నాలుగు బడులు మూత
- పాతపాళెం బడి వద్ద దళితుల ఆందోళన
- పట్టించుకోని జిల్లా అధికారులు



పాతపాళెం బడికి తాళం వేస్తున్న గ్రామస్తులు



పాతపాళెం పాఠశాల వద్ద ఆందోళన

కేవీబీపురం: ప్రైమరీ పాఠశాలలను మోడల్ స్కూళ్లలో విలీనం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓను రద్దు చేయాలని కోరుతూ మండలంలోని పాతపాళెం దళితకాలనీకి చెందిన 40 మంది పాతపాళెం మోడల్ ప్రైమరీ పాఠశాల వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ఇదే సమస్యపై తాము గత 43 రోజులుగా పోరాడుతున్నా మండల, జిల్లా అధికారులు దున్నపోతు మీద వాన కురుస్తున్నట్టే కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. 117 జీఓ కారణంగా తమ బిడ్డలు బడులకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో 34 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ మండల అధికారులు జిల్లా అధికారులు మెప్పు కోసం తమ పాఠశాలను బీసీ కాలనీలో విలీనం చేశారని ఆరోపించారు. అక్కడ ఉన్న పాఠశాలలో రెండు తరగతులు మాత్రమే ఉన్నాయని, మరుగుదొడ్లు, ఆటస్థలం తదితర కనీస వసతులు లేవని తెలిపారు. తమ పాఠశాలలో కావాల్సిన విద్యార్థుల సంఖ్యతో తరగతి గదులు, మరుగుదొడ్లు, క్రీడా మైదానం వసతులు ఉన్నాయని తెలిపారు. తమ పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాల కమిటీకి ఇచ్చిన తీర్మానాన్ని సైతం అధికారులు, వారి సిబ్బంది కనీసం లెక్క చేయలేదని పాఠశాల కమిటీ సభ్యులు ఆరోపించారు. బంగారమ్మకండ్రిగ, గురుకుల కండ్రిగ, పీవీ పురం, జ్ఞానమ్మకండ్రిగ గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యపై దృష్టి సారించి, పిల్లలను బడిబాట పట్టించాలని కోరుతున్నారు.

ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు



గ్రానైట్ లేయింగ్ పనులను పరిశీలిస్తున్న సీసీఎల్ పరిశ్రమ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమీపంలోని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ (సీసీఎల్) పరిశ్రమ ముందుకొచ్చింది. గత ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా పాఠశాలకు నాలుగు అదనపు గదులు మంజూరయ్యాయి. గదులు నిర్మాణం పూర్తయినప్పటికీ అరుగు కోసం వేయాల్సిన గ్రానైట్ బండల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఎన్నికల సమీపించడం, ప్రభుత్వం మారిపోవడంతో ఆ పనులు అంతటితో ఆగిపోయాయి. దీంతో గత ప్రభుత్వంలో గ్రానైట్ బండలు సరఫరా జరిగినప్పటికీ వాటిని అమర్చలేదు. ఈ విషయాన్ని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవయ్య సీసీఎల్ పరిశ్రమ వారికి విన్నవించారు. దీనిపై స్పందించిన పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.1.52 లక్షలతో గ్రానైట్ పనులు పూర్తి చేసేందుకు చేయూతనిచ్చారు. శనివారం పరిశ్రమ సీనియర్ మేనేజర్, పీఆర్ఓ కృష్ణకిషోర్, ప్లాంట్ హెడ్ సర్వేశ్వరరావు, స్థానిక గ్రామ పెద్దలతో కలసి గ్రానైట్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు ఎస్ఎంసీ చైర్మన్ యుగంధర్, గ్రామ పెద్దలు బాబురెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వరదయ్యపాళెం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

అక్షయ క్షేత్రంలో పండ్లు పంపిణీ

రేణిగుంట: విమానాశ్రయ మార్గంలోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం అక్షయ క్షేత్రంలో శుక్రవారం మధ్యాహ్నం శంకర్ షాలిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు, గిరిజన సమైక్య, గిరిజన విద్యార్థి సమైక్య జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు వడిత్య శంకర్ నాయక్ జన్మదిన వేడుకలను మానసిక వికలాంగుల మధ్య జరుపుకున్నారు.పండ్లు ఫలహారాలు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సమైక్య యువత అధ్యక్షులు హనుమంతు నాయక్, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు మంజుకుమార్ నాయక్, తేజా నాయక్, అక్షయ క్షేత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన



పాపానాయుడుపేట వద్ద స్క్రీనింగ్ పరీక్షలు చేయడానికి వచ్చిన స్విమ్స్ వైద్య బృందం

ఏర్పేడు: మండల కేంద్రంతోపాటు పాపానాయుడుపేటలోని పీహెచ్‌సీల వద్ద శుక్రవారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరం స్విమ్స్ (తిరుపతి) వైద్యబృందం నిర్వహించింది. తొలుత క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాలతో అవగాహన కల్పించారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలతోపాటు పింక్ బస్సులో పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా చేశారు. అనుమానిత లక్షణాలు ఉన్న మహిళలు, పురుషులు ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, పాపానాయుడుపేట వైద్యాధికారి డాక్టర్ లావణ్య, ఏర్పేడు వైద్యాధికారి డాక్టర్ శివప్రియ, స్విమ్స్ మెడిలాఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, సీహెచ్ఓ రాజేశ్వరి, సూపర్‌వైజర్లు సుబ్రహ్మణ్యం, మంజుల, ఎంఎల్‌హెచ్‌పి లహరి, ఏఎన్ఎంలు తాహిరా, ఉషా, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ సభ్యులకు సన్మానం

శ్రీకాళహస్తి: బీజేపీ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గంలో బాధ్యతలు స్వీకరించిన మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి బీడీ బాలాజి, కొండేటి గోపాల్, మునీశ్వరి, లింగా బత్తిన గోపాల్, యతీందర్ రెడ్డి, రమణారెడ్డిని, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఘనంగా సన్మానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు అర్హులకు అందేలా తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో హరీష్‌రెడ్డి, వేదాల కృష్ణయ్య, బి.వెంకటేష్, పూజారి ప్రేమకుమార్, ధర్మయాదవ్ పాల్గొన్నారు.

ఆగమోక్తంగా పల్లకీ సేవ





ప్రత్యేకాలంకారంలో శ్రీవళ్లీ దేవసేన, కుమారస్వామి



పల్లకిలో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీవళ్లీదేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పల్లకీ సేవ ఆగమోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు చేశారు. వేదమంత్రోచ్చరణల, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను పల్లకీల్లో అధిష్ఠింపజేశారు. మొదట శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి బయలుదేరారు. పురవీధుల్లో మూడు పల్లకీలలో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తుల బారులు తీరారు. కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ



పాతపాళెం స్థానికులతో మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

- విలీనం వద్దంటూ తల్లిదండ్రుల నిరసన
- బాధితులకు నూకతోటి రాజేష్ సంఘీభావం

కేవీబీపురం: కూటమి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని, 117 జీఓ కారణంగా పేద బిడ్డలు చదువులకు దూరం కావడమే కాకుండా సుమారు 30 శాతం బడులు మూత పడబోతున్నాయని వైఎస్ఆర్ సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. కేవీబీపురం మండలం, పాతపాళెం గ్రామంలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు 117 జీఓను రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన ఆందోళనకు రాజేష్ సంఘీభావం తెలిపారు. ఆయన గ్రామస్తులను నేరుగా కలిసి, వారి సమస్యపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ బడులకు దీటుగా అభివృద్ధి చెందాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రైమరీ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మార్చుతూ విలీన ప్రక్రియను చేపట్టడంతో గ్రామాల మధ్య దూరం కారణంగా ఆరు పాఠశాలల్లో సుమారు 300 మంది పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యారని విమర్శించారు. 46 రోజులుగా పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాలను అధికారులు ఇప్పటివరకు డ్రాపౌట్ బాక్స్‌లో పెట్టకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి కేవీబీపురం మండలంలో పర్యటించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల పక్షాన పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సర్పంచ్ సుకన్య, నేతలు గవర్ల కృష్ణయ్య, బొర్రా మాధవీరెడ్డి, నందకుమార్, బాలసుబ్రమణ్యం, ప్రవీణ్, జాకీర్, ఆర్‌టీఐ వింగ్ జిల్లా సభ్యుడు జగదీష్ పాల్గొన్నారు.

తుడా నిధులతో కరకంబాడిని అభివృద్ధి చేస్తాం



విద్యార్థులతో స్థానిక ఎమ్మెల్యే, తుడా చైర్మన్

రేణిగుంట: మండలంలోని మేజర్ పంచాయతీ కరకంబాడిని తుడా నిధులు రూ.కోటి 50 లక్షలతో అభివృద్ధి చేస్తానని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ×ఎ డే విత్ తుడా చైర్మన్‌¤ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి తుడా చైర్మన్ శుక్రవారం కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్‌లో పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థ, సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు సమస్యలు నివేదించడంతో ఆయన పైవిధంగా స్పందించారు. అనంతరం పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తుడా నిధులతో శ్రీకాళహస్తికి మహర్దశ

శ్రీకాళహస్తి: తుడా నిధులతో శ్రీకాళహస్తికి మహర్దశ ప్రాప్తిస్తుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డితో కలిసి ఎ డే విత్ తుడా చైర్మన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పలు ప్రాంతాలలో వారు పర్యటించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి, డ్రైనేజీ సమస్యలను ప్రజలు వారి దృష్టికి నివేదించారు. దీనిపై అధికారులతో మాట్లాడారు. డ్రైనేజీ పైపులైన్లు, తాగునీటి పైపులైన్ల కోసం అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. జయరామరావువీధిలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారిని సత్కరించారు. టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యం

ఏర్పేడు: పిల్లలకు విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని, వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మునగలపాళెం జెడ్పీ హైస్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. సమస్యలపై విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాలకు ఆటస్థలం కోసం ఎకరా ప్రభుత్వ స్థలం కేటాయించాలని తహసీల్దార్ భార్గవిని ఆదేశించారు. మూడు నెలల్లో తుడా నిధులతో ఆటస్థలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, సర్పంచ్ మంజుభార్గవి, మోహన్‌రావు, సతీష్‌నాయుడు, వేణుగోపాల్ నాయుడు, గురవారెడ్డి, పొన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం డాంగే యాదవ్

సత్యవేడు: స్వయం సహాయక సంఘాల మహిళలకు గ్రామ సమృద్ధి ప్రణాళిక(వీపీఆర్‌పీయాప్)పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం డాక్టర్ డాంగేయాదవ్ మాట్లాడుతూ ఎస్ఆర్ ఎల్ఎంలో పేద కుటుంబాల సభ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, జీవనోపాధి, ఆరోగ్యం, పారిశుధ్యం, సామాజిక భద్రత, సహజీవన వనరులు అభివృద్ధి ప్రణాళిక సదుపాయాల అభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధికి అవసరాలను గుర్తించి సమగ్ర ప్రణాళికను తయారు చేయాలన్నారు. అక్టోబరు 2వ తేదీన జరగనున్న గ్రామసభలలో ఆమోదం పొంది వీపీఆర్‌పీకి అనుసంధానం చేయాలని తెలిపారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు మాట్లాడుతూ సర్వేను అప్రమత్తంగా చేయాలని సూచించారు. పీ4పై అవగాహన కల్పించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చైతన్య, సీసీలు శివకుమార్, మధుసూదన్, పురుషోత్తం, పుల్లయ్య, మంగయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన, వీఓ లీడర్లు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

బ్రెయిన్ డేపై అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రేణిగుంట: వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా శుక్రవారం మండలంలోని కరకంబాడి అమర హాస్పిటల్‌లో మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అనువైన విధానం, పద్ధతులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఈఎస్ఐసీ జాయింట్ డైరెక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్ మురళీమోహన్ మాట్లాడారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమర హాస్పిటల్ చైర్‌పర్సన్ డాక్టర్ జి.ప్రసాద్, డాక్టర్ జి.రమాదేవి, సిఓఓ భాగ్యలక్ష్మి, శ్రీధర్, న్యూరాలజీ హెచ్ఓడి, డాక్టర్లు వీకే.ఆనంద్, యశ్వంత్ సందీప్, విజయేందర్ రెడ్డి, అనిల్ బాబు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రికి సాదర స్వాగతం

రేణిగుంట: తిరుమల శ్రీవారి దర్శనార్థం శుక్రవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విజయవాడ నుంచి వందే భారత్ రైల్లో రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆమెను రైల్వే స్టేషన్లో అధికారులు, టీడీపీ నాయకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లారు.

చిన్నారిని చితకబాదిన టీచర్

కలువాయి(సైదాపురం): యూకేజీ చదువుతున్న చిన్నారిని ప్రైవేటు టీచర్ చితకబాదడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన కలువాయిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు కలువాయిలోని ఓ ప్రైవేటు స్కూల్లో యూకేజీ చదువుతున్న వీర సంతవిష్ణును స్కూల్ టీచర్ శ్రావణి చితకబాదారు. ఆ విద్యార్థికి స్నానం చేయిస్తుండగా ఒంటిపై దెబ్బలు చూసి ఆ తల్లి నిశ్చేష్టురాలయ్యారు. దీంతో కలువాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆగిన ఆధార్ సేవలు

- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



నాగలాపురం సచివాలయంలో ఖాళీ కుర్చీలతో ఆధార్ కేంద్రం

వరదయ్యపాళెం: ప్రభుత్వం సూచించిన కొన్ని సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న ఆధార్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. గత రెండు వారాల నుండి ఈ ప్రక్రియ ప్రజలకు దూరమైంది. దీంతో ఆధార్ మార్పులు, చేర్పులు, నూతనంగా ఆధార్ నమోదు కోసం ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. కేవలం కొన్ని సచివాలయాల్లో మాత్రమే పూర్తిస్థాయిలో ఆధార్ సేవలు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే ఆ ప్రాధాన్యతను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం ఆధార్ సేవలను పూర్తిగా ఆపివేసింది. దీంతో సంక్షేమ పథకాలు, ఇతర అవసరాల కోసం ఆధార్ అప్‌గ్రేడ్ చేసుకోదలచిన వారు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. కనీసం వారికి ఎప్పటి నుండి సేవలు అందుబాటులోకి వస్తాయన్న సమాచారాన్ని సచివాలయాల వద్ద చెప్పే దిక్కులేని స్థితిలో కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నీరుగార్చుతోంది. దీంతో ఆధార్ నమోదు కోసం వచ్చే ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతోంది.

బదిలీల సాకు

ఇటీవల సచివాలయ ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. అయితే బదిలీల ప్రక్రియ పూర్తయినప్పటికీ ఆధార్ సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా 7 మండలాల్లో సుమారు 30కి పైగా సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు గతంలో జరిగేవి. ప్రస్తుతం ఒక్కచోట కూడా ఆధార్ కేంద్రం అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

15 నాటికి 14వేల గృహ ప్రవేశాలు

- జిల్లా గృహనిర్మాణ శాఖ ఎండీ శివప్రసాద్



చిందేపల్లె లేఔట్‌ను పరిశీలిస్తున్న గృహనిర్మాణ శాఖ ఎండీ శివప్రసాద్

ఏర్పేడు: ఆగస్టు 15వ తేదీ నాటికి జిల్లాలో 14వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలనే లక్ష్యంతో వెళ్తున్నట్టు జిల్లా గృహ నిర్మాణ శాఖ ఎండీ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని చిందేపల్లె, శ్రీకాళహస్తి మండలం ఊరందూరు పామై-ఎన్టీఆర్ నగర్ లేఔట్లను ఆయన పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల గృహప్రవేశాలలో భాగంగా తిరుపతి జిల్లాలో 14,001 ఇళ్లను వచ్చే నెల 15 కల్లా గృహప్రవేశాలను చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి.దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.